# చారిత్రాత్మకం

## కాంగ్రెసేతర పక్షాల పునరేకీకరణకు వేదికైన విజయవాడ

**న్యూస్‌టుడే- విజయవాడ**

రాజకీయాల రాజధాని విజయవాడ. ఎన్టీఆర్ హయాంలో జాతీయ రాజకీయాలకు కాంగ్రెసేతర పక్షాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు ఈ నగరమే వేదికగా నిలిచింది. మళ్లీ 20 ఏళ్ల తర్వాత అదే దృశ్యం ఇక్కడ కనిపించింది. అంతేకాకుండా అప్పుడు కాంగ్రెసేతర పక్షాలుగా ఉన్న వారే మళ్లీ ఇదే వేదికపై దర్శనమిచ్చారు. కాకపోతే తరం మారింది. ఆ రోజు ఉన్న వారిలో ఒక ఫరూక్ అబ్దుల్లా మాత్రమే మళ్లీ ఈ రోజు వేదికపై కనిపించారు. అదే కోవలో మరోసారి ఈ నవంబరు 24 రాజకీయ చారిత్రాత్మక సన్నివేశంగా నిలవబోతోంది.

శనివారం తెలుగుదేశం పార్టీ నిర్వహించిన గర్జన సభలో ప్రధానంగా రెండు లక్షణాలు కనిపించాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నాయకులు ఈ కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో తృతీయ ప్రత్యామ్నాయ వేదిక బలోపేతంగా అభివర్ణించారు. జాతీయ స్థాయి రాజకీయాల్లో యుఎన్‌పీఏ పాత్రను ప్రధానంగా ప్రస్తావించారు. గతంలో నేషనల్ ఫ్రంట్ రాజకీయాల్లో తెలుగుదేశం కీలకపాత్ర పోషించిన సందర్భాలను సన్నివేశాలను గుర్తు చేసుకున్నారు. కాశ్మీర్ నుంచి జార్ఖండ్, అస్సాం, యుపీ, ఆంధ్రప్రదేశ్ సమస్యలు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. అంతర్గత భద్రత, కేంద్ర రాష్ట్ర సంబంధాలు వంటివి చర్చకు వచ్చాయి. రైతులకు మద్దతుగా యుఎన్‌పీఏ ఏం చేయబోయేది ఆ తర్వాతి క్రమంలో వివరించారు.

తెలుగుదేశం నాయకులు మాత్రం జాతీయస్థాయిలో ఇది తృతీయ ప్రత్యామ్నాయం అన్న భావన కన్నా కూడా పూర్తిగా రైతులు, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకాంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు ఎలా అన్యాయం జరుగుతోందో వివరించడానికి ప్రయత్నించారు. కేంద్రం కూడా ఎలా కనికరించడం లేదో చెప్పారు. రాష్ట్రంలోను, కేంద్రంలోను కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నా ఇక్కడ ఎందుకు అన్యాయం జరుగుతోందంటూ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రసంగం యావత్తూ రైతులు, వారి సమస్యలపైనే దృష్టి పెట్టడం విశేషం. మొత్తం ప్రసంగం యావత్తూ రైతుల చుట్టూ... పంటల చుట్టూ తిరిగింది. ముఖ్యమంత్రిగా ఉండగా తాను సంస్కరణలు, ఐటీకి ప్రాధాన్యం ఇచ్చానని... ఇక రైతులే తన ప్రధాన ఎజెండా అంటూ స్పష్టంగా ప్రకటించారు. దేవేందర్ గౌడ్, ఎర్రంనాయుడు, హరికృష్ణ కూడా ప్రధానంగా రైతు అంశాలనే ప్రస్తావించారు.

### రెండు గంటలు ఆలస్యంగా సభ

అనుకున్న సమయం కన్నా రెండు గంటలు ఆలస్యంగా సభ ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు సభ ప్రకటించారు. అయితే ఆరుగంటల సమయంలో ప్రారంభమైంది. ర్యాలీ నాలుగు కిలోమీటర్ల మేర సాగడానికి చాలా ఎక్కువ సమయం పట్టడమే కారణం. అంతకుముందు హోటల్‌లో యుఎన్‌పీఏ సమావేశం కూడా ఆలస్యం అయింది. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన యుఎన్‌పీఏ సమావేశం మధ్యాహ్నం 12.30కు ప్రారంభమైంది. ఆ తర్వాత విలేకరుల సమావేశం ముగించుకుని ర్యాలీకి బయలుదేరారు. ఈ ర్యాలీ ఎన్టీఆర్ విగ్రహం నుంచి కానూరు సిద్ధార్థ ఇంజనీరింగు కాలేజీకి చేరడానికి రెండుగంటల సమయం పట్టింది. విజయవాడ బందరు రహదారిలో రెండు వైపులా వాహనాలను వదిలినా... నాలుగు కిలోమీటర్ల మేర ర్యాలీ సాగేందుకు ఇబ్బందులు తప్పలేదు. అదే సమయంలో వివిధ ప్రాంతాల నుంచి వేదిక వద్దకు వచ్చే జనాలు కూడా కలిసిపోయారు. దీంతో ఒకేసారి ర్యాలీ వేదిక వద్దకు చేరుకోవడం సభాస్థలి కిక్కిరిసి వేలాది జనాలు రోడ్లపైనే నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.